క్లుప్తంగా

ఓటమి భయంతోనే ఎన్నిక అడ్డగింత



ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు

డోర్నకల్: రైల్వే ఇనిస్టిట్యూట్ ఎన్నికను ఓటమి భయంతోనే సంఘం నాయకులు అడ్డుకుంటున్నారని మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజనల్ సెక్రెటరీ రవీందర్ ఆరోపించారు. జూన్ 6న జరగాల్సిన డోర్నకల్ రైల్వే ఇనిస్టిట్యూట్ ఎన్నికను హోల్డ్‌లో పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం రైల్వే ఏడీఈఎన్ కార్యాలయం ఎదుట మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాతో ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు ఏడీఈఎన్ కార్యాలయం ఎదుట బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ వరంగల్ బ్రాంచి సెక్రెటరీ ఆవుల యుగేందర్, కాజీపేట టెక్నికల్ బ్రాంచి సెక్రెటరీ రావుల సాంబయ్య, ఇంజనీరింగ్ బ్రాంచ్ సెక్రెటరీ రాజేందర్, డోర్నకల్, జమ్మికుంట, మధిర బ్రాంచ్ సెక్రెటరీలు అంజియాదవ్, శ్రీనివాస్, సంపత్‌రాజ్, డోర్నకల్ బ్రాంచ్ చైర్మన్ చరణ్‌నాయక్ పాల్గొన్నారు.

రక్తనమూనాల సేకరణ

గార్ల: జిల్లా డీఎమ్‌హెచ్‌ఓ ఆదేశాల మేరకు మండలంలోని పుల్లూరు గ్రామంలో పైలేరియా(బోధకాలు) వ్యాధి నిర్ధారణ కోసం 300 మంది నుంచి వైద్యసిబ్బంది రక్త నమూనాలు సేకరించినట్లు డబ్ల్యూహెచ్‌ఓ అబ్జర్వర్ దశరథ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ గోపిచంద్, హెచ్‌ఎస్ ఇస్మాయిల్‌బేగ్, ఎంఎల్‌హెచ్‌పీ సుమతి, ఏఎన్‌ఎం శాంతాబాయి పాల్గొన్నారు.

మరమ్మతులు చేపట్టాలి

నెల్లికుదురు: ఇటీవలే కురిసిన భారీ వర్షాలకు మండలంలోని వివిధ గ్రామాల్లో తెగిపోయిన పెద్దపెద్ద చెరువు కట్టలకు తక్షణమే మరమ్మతుల చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి ఇస్సంపల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఈ మేరకు మండలంలోని తెగిపోయిన రావిరాల గ్రామ పెద్దచెరువు కట్ట గండి వద్ద సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బాబు గౌడ్, యాకన్న, నర్సయ్య, అంజయ్య, ఐలయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

మాలమహానాడు మండల అధ్యక్షుడిగా సుధాకర్

దంతాలపల్లి: మాలమహానాడు మండల అధ్యక్షుడిగా మండలంలోని పెద్దముప్పారం గ్రామానికి చెందిన సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, జాతీయ కార్యదర్శి ఆశోద భాస్కర్ ఆదేశాల మేరకు కందుకూరి సోమన్న అధ్యక్షతన మంగళవారం ఎన్నిక నిర్వహించారు.

నల్లబెల్లం పట్టివేత



పట్టుబడిన బెల్లం చూపిస్తున్న పోలీసులు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలు, తండాజీపేల పరిధిలో ఎక్సైజ్ శాఖ హైదరాబాద్ ఎస్టీఎఫ్ బృందాలు మంగళవారం దాడులు నిర్వహించాయని ఎక్సైజ్ సీఐ జి.చిరంజీవి మంగళవారం తెలిపారు. ఇందులో భాగంగా వేమునూరు, అడ్డాసికుంట తండా, సీత్లా తండా పరిధిలో జరిగిన దాడుల్లో బీదర్ నుంచి మహబూబాబాద్ జిల్లా ప్రాంతానికి తవేరా వాహనంలో బెల్లం తీసుకురాగా ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. 1,600 కిలోల నల్లబెల్లం, 50కిలోల పటిక లభ్యం కాగా సీత్లా తండాకు చెందిన భూక్యా వీరన్న, గూడూరు మండలం బీరన్న తండాకు చెందిన తేజావత్ ప్రవీణ్, అడ్డాసికుంట తండాకు చెందిన గుగులోతు నరేష్ పై కేసు నమోదు చేశామన్నారు. అదే విధంగా మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని వీరారం తండాలో భూక్యాన రోజా, జాటోత్ సరోజను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 15లీటర్ల నాటు సారాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. దాడుల్లో డీటీఎఫ్ సీఐ నీరజ, ఎక్సైజ్ ఎస్సై అశోక్ కుమార్, ఎస్టీఎఫ్ ఎస్సై బాలరాజు, హెడ్ కానిస్టేబుల్ విజయకృష్ణ, కానిస్టేబుళ్లు రాజేష్, రవి, వెంకటనరసయ్య, భవాని పాల్గొన్నారు.

ఆస్పత్రిలో ఒక్క డాక్టర్ లేడు..!



చికిత్స పొందుతున్న చందన

గార్ల: పురుగుమందు తాగిన యువతిని చికిత్స కోసం సీహెచ్‌సీకి తీసుకొస్తే ఆస్పత్రిలో ఒక్క డాక్టర్ కూడా లేడని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పినిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన చందన మంగళవారం ఇంట్లో పురుగుమందు తాగింది. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన గార్ల సీహెచ్‌సీకి తీసుకు రాగా, ప్రస్తుతం నలుగురు డాక్టర్లు విధులు నిర్వహిస్తున్నా, కనీసం ఒక్క డాక్టర్ సైతం లేకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నర్సులు చందనకు సెలైన్ పెట్టారు.

తునికాకు కాంట్రాక్టర్ల చీకటి దందా

- అధికారుల కళ్లు గప్పి బ్లాక్ మార్కెట్‌కు..
- దొడ్డిదారిన దోచుకుంటున్న వైనం



ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్న తునికాకు బస్తాలు

కొత్తగూడ: ఏజెన్సీ గ్రామాల్లో మూడో పంటగా గుర్తింపు పొందిన తునికాకును కాంట్రాక్టర్లు అధికారుల కళ్లు గప్పి బ్లాక్ మార్కెట్‌కు తరలించి లక్షలు ఆర్జిస్తున్నారు. జిల్లాలోని కొత్తగూడ, గంగారం, గూడూరు, బయ్యారం మండలాల పరిధిలో తునికాకు సేకరణ జరుగుతుంది. కొన్ని యూనిట్లు మినహా మిగతా యూనిట్లలో ఆకు అనుకూలంగా లభిస్తోంది. ఆకు సేకరించడానికి ప్రూనింగ్, ఆకు సేకరణ, గోదాంలకు తరలింపు కోసం ప్రభుత్వం టెండర్లు నిర్వహిస్తుంది. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు కూలీల వద్ద నుంచి ఆకు సేకరించి రోజు వారి వివరాలను ఫారెస్ట్ అధికారులకు అప్పగిస్తారు. కూలీలకు డబ్బులు ప్రభుత్వమే నేరుగా వారివారి అకౌంట్లలో వేస్తుంది. ఇలా సేకరించిన ఆకు ఎండిన తరువాత అటవీ శాఖ గుర్తింపు పొందిన గోదాముల్లో భద్రపరుస్తారు. తరువాత బీడీ తయారీ కంపెనీలకు డిమాండ్‌ను బట్టి విక్రయిస్తారు. ఇలా వచ్చిన ఆదాయంలో కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం రాయాల్టీ చెల్లిస్తుంది. తరలింపు సమయంలో అటవీ శాఖ అధికారులు బస్తాలను లెక్క వేసుకుని వాటికి సరిపోను వే బిల్లులు ఇస్తారు. తరలింపు సమయంలో చెక్ పోస్టుల వద్ద, గోదాం వద్ద దిగుమతి అయ్యే సమయంలో వే బిల్లు పరిశీలించి దిగుమతి చేస్తారు.

బ్లాక్ మార్కెట్‌కు తరలింపు ఇలా..

తునికాకు సేకరించి తరలించే సమయంలో కొన్ని లారీలను వే బిల్లు లేకుండా, ప్రభుత్వ గోదాంలకు తరలించకుండా బ్లాక్ మార్కెట్‌లో నేరుగా విక్రయించి తక్షణ సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా జంగవానిగూడెం కల్లం నుంచి పూనుగొండ్ల యూనిట్ కాంట్రాక్టర్ డీసీఎంలో ఆకు తరలిస్తూ సోమవారం రాత్రి పట్టుబడిన విషయం తెలిసిందే. కాంట్రాక్టర్లు ఇదే తరహాలో ఎక్కువ మొత్తంలో ఆకును బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుని ప్రకృతి వైపరీత్యాలు(గాలి దుమారం, వర్షాల) కారణంగా కట్టలకు నష్టం జరిగిందని, తప్పుడు నివేదికలు ప్రభుత్వానికి అందజేస్తారు. ఈ తతంగంలో అటవీ శాఖ అధికారుల పాత్ర ఉన్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. ఇప్పటికైనా అధికారులు నిఘా పెంచి తునికాకును బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రత్యేక టీంలు ఏర్పాటు చేస్తాం..

తునికాకు బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తాం. నిఘా పెంచి సేకరించిన తునికాకు గోదాంలకు తరలించేవిధంగా చర్యలు తీసుకుంటాం. బ్లాక్ మార్కెట్‌కు తరలించేందుకు యత్నిస్తే కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టి చర్యలు తీసుకుంటాం.

\- చంద్రశేఖర్, ఎఫ్‌డీఓ

విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచాలి

కేసముద్రం: ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు ఉపయోగించుకుంటూ, విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచేలా కృషి చేయాలని కేసముద్రం, ఇనుగుర్తి ఎంఈఓలు కాలేరు యాదగిరి, రూపారాణి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని కేసముద్రంస్టేషన్ జెడ్పీహైస్కూల్‌లో ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల రిసోర్స్ పర్సన్‌లు ఐదురోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్పీ సారంగం, ఎంఆర్‌పీలు యాదగిరి, రాములు, అశోక్, భాస్కర్, భాస్కర్ పాల్గొన్నారు.

నెల్లికుదురు: ఉపాధ్యాయులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ రాందాస్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని మంగళవారం ఎంఈఓ ప్రారంభించారు.

నైపుణ్యాల సాధనకు కృషి చేయాలి

పెద్దవంగర: వృత్తి పరమైన నైపుణ్యాల సాధనకు కృషి చేయాలని జిల్లా రిసోర్స్ పర్సన్ రాకేష్, మండల రిసోర్స్ పర్సన్ కవిరాజు అన్నారు. మండలంలోని ఉపాధ్యాయులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.



కేసముద్రం: మాట్లాడుతున్న ఎంఈఓ

బోధనలో నైపుణ్యత చూపాలి

గూడూరు: ఉపాధ్యాయులు తరగతిలో నైపుణ్యతో కూడిన విద్యాబోధనందిస్తూ తమ ప్రతిభను చూపాలని ఎంఈఓ రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

దోర్నకల్: ఐదురోజుల పాటు నిర్వహించే జిల్లా స్థాయి నైపుణ్య శిక్షణతరగతులను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ ఆంగోత్ లక్ష్మానాయక్ కోరారు. స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ఎంఈఓ ప్రారంభించారు.

సీతారామ ప్రాజెక్ట్ నీటిని మళ్లించాలి



మాట్లాడుతున్న వెంకట్‌యాదవ్

గార్ల: సీతారామ ప్రాజెక్ట్ నీటిని ఇల్లెందు నియోజకవర్గంలోని ఐదు మండలాల వ్యవసాయ సాగు భూములకు ఇవ్వాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ చలకాని వెంకట్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మంగళవారం గార్లలో నిర్వహించిన గోదావరి జలసాధన సమితి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత కేసీఆర్ పాలనలో ఏజెన్సీ ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఇల్లెందు నియోజకవర్గంలోని రోళ్లపాడులో సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారన్నారు. సీఎం కేసీఆర్‌కు లేనిపోని సాకులు చెప్పి నాటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీతారామ ప్రాజెక్ట్ రీడిజైన్ చేసి, ఇల్లెందు నియోజకవర్గానికి నీళ్లు ఉపయోగపడకుండా, పాలేరు, సత్తుపల్లికి గోదావరి జలాలను తరలిస్తూ, ఏజెన్సీ ప్రాంతాలకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు రామనాథం, కట్టెబోయిన శ్రీనివాస్, గుండా వెంకట్‌రెడ్డి, దనియాకుల రామారావు, సక్రు, రాధాకృష్ణ, కత్తి సత్యం పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



ఉష (ఫైల్)

గార్ల: గత కొంతకాలంగా గర్భకోశ వ్యాధితో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఓ వివాహిత కలుపు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం కొత్తతండాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్ల మండలం మద్దివంచ పంచాయతీ కొత్తతండాకు చెందిన భూక్యా రాంబాబు, కురవి మండలం హరిదాస్‌తండాకు చెందిన భూక్యా ఉష(26) ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి మూడేళ్ల పాప ఉంది. ఉష రెండేళ్ల నుంచి గర్భకోశ వ్యాధితో బాధపడుతుంది. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా జబ్బు నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది పురుగుమందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఖమ్మం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తుండగా మృతిచెందింది. మృతురాలి తండ్రి ధరావత్ భాష్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రెయినీ ఎస్సై ఎస్‌డీ మైబూబీ వెల్లడించారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

కురవి: కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ పోతుగంటి మల్లయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయం నుంచి ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సుధాకర్, షేక్ ఉస్మాన్, కట్ల కృష్ణయ్య, పాషా, నిర్మల పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదాలు..



టీక్యాతండాలో ట్రాన్స్‌ఫార్మర్ ఇనుప కంచెను పట్టుకొని ఆడుకుంటున్న చిన్నారులు



సీసీ రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

పెద్దవంగర: ఆడుతూ గడిపే పిల్లలకు కంటికి కనిపించని విద్యుత్‌తో ప్రమాదం పొంచి ఉందని తెలియక సరదాగా ఆడుకుంటున్నారు. మండలంలోని టీక్యాతండాలో కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. జనావాసాల మధ్యన ఉండడంతో చుట్టు పక్కల ఉన్న పిల్లలు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆటలు ఆడుకుంటున్నారు. అలాగే తండాలో సీసీ రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం ఉంది. విద్యుత్ అధికారులు చొరవ తీసుకొని ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్ స్తంభంను తొలగించి మరోచోట ఏర్పాటు చేయాలని తండావాసులు కోరుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో 2025–26 విద్యా సంవత్సరానికిగాను బెస్ట్ అవైలబుల్ స్కూల్ (రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్)లో ప్రవేశాలకు అర్హులైన ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి నరసింహస్వామి మంగళవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లోని శాఖ కార్యాలయంలో ఈనెల 21నుంచి దరఖాస్తు ఫారాలు అందిస్తామన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 26వ తేదీ సాయంత్రం 5గంటలకు అందజేయాలన్నారు. డ్రా పద్ధతిలో కలెక్టర్ ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ఎస్సీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కార్మికులను వంచిస్తున్న ప్రభుత్వాలు



ర్యాలీ నిర్వహిస్తున్న సంఘాల నాయకులు

తొర్రూరు: కార్మికుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఓమ భిక్షపతి, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఏఐటీయూసీ, టీయూసీఐ, సీఐటీయూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్ కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బస్టాండ్ సెంటర్‌లో ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ యాకుబ్, నాయకులు జమ్ముల శ్రీను, బందు మహేందర్, గణపురం లక్ష్మణ్, అర్వపల్లి వెంకన్న, గుండాల సోమనర్సయ్య పాల్గొన్నారు.

డోర్నకల్: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జూలై 9న అఖిల భారత కార్మిక సమ్మె నిర్వహించనున్నట్లు సీఐటీయూ మండల కార్యదర్శి దాసరి మల్లేశం మంగళవారం తెలిపాడు. కార్యక్రమంలో నాయకలు బద్దెల పున్నయ్య, బాబు, సుధాకర్, బద్దెల వెంకటేశ్వర్లు, గునిగంటి రాము పాల్గొన్నారు.

బయ్యారం: కార్మికరంగ సమస్యల పరిష్కారం కోసం జూలై 9న కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పలు కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం బయ్యారంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లచ్చయ్య, మోహన్, కోటమ్మ, పూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



విద్యార్థులకు జ్ఞాపికను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

మహబూబాబాద్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలో మంగళవారం మానుకోట నియోజకవర్గంలోని ఐదు మండలాలలో పదో తరగతిలో మండల టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులను శంకర్‌నాయక్ సన్మానించి, నగదు అందజేశారు. మొదటి ర్యాంకర్‌కు రూ 5వేలు, రెండో ర్యాంకర్‌కు రూ.3వేలు, మూడో ర్యాంకర్‌కు రూ.2వేల చొప్పున అందజేసినట్లు తెలిపారు. అనంతరం శంకర్‌నాయక్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సతీమణి సీతామహాలక్ష్మి, నాయకులు నాయిని రంజిత్‌రెడ్డి, చిట్యాల జనార్దన్, సుదగాని మురళీ, లూనావత్ అశోక్, ఫరీద్, రామరాజు యాకన్న, ఏలేందర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

పాలన చేతకాకనే అనుచిత వ్యాఖ్యలు



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

తొర్రూరు: పాలన చేతకాకనే అధికార పార్టీ నాయకులు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకులు ఆరోపించారు. దయాకర్‌రావుపై పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం డివిజన్ కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం బీఆర్‌ఎస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.. నియోజకవర్గంలో దయాకర్‌రావు చేసిన అభివృద్ధి మాత్రమే కనిపిస్తుందని, స్థానిక ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సీతారాములు, నవీన్, ఈదురు ఐలయ్య, నరసింహ, నాయకులు శ్రీనివాస్, సుందర రాంరెడ్డి, శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



తొర్రూరు రూరల్: రోడ్డుపై ధర్నా చేస్తున్న ఉపాధి కూలీలు

తొర్రూరు రూరల్: ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం వారి ఆధ్వర్యంలో మండలంలోని అమ్మాపురం గ్రామంలో తొర్రూరు–నర్సంపేట రోడ్డుపై ధర్నా కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ యాకుబ్ మాట్లాడుతూ.. తీవ్ర ఎండల్లో సైతం ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు సరైన కనీస వేతనం ఇవ్వడం తోపాటు టెంట్, తాగునీరు, పనిముట్లు, మెడికల్ కిట్ వంటి వసతులను కల్పించాలన్నారు.

ఉపాధి పనుల వద్ద సౌకర్యాలు కల్పించాలి

కురవి: ఉపాధి హామీ పనులు వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు తగరం తిరుపతి అన్నారు. మంగళవారం సీరోలు ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగికి సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అట్లూరి వీరస్వామి, ఎర్ర బక్కయ్య, తగరం వెంకటమ్మ, లచ్చమ్మ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వైద్యశిబిరం

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధి కేంద్రంలో మెగా హెల్త్ క్యాంప్‌ను మంగళవారం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ హెల్త్‌క్యాంప్‌లో మెడికల్ ఆఫీసర్లు నంబీకిషోర్, శ్రీకాంత్ మున్సిపాలిటి సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్స్ ప్రభాకర్, అహ్మద్ అన్సారీ, సీహెచ్‌ఓ సాజిద్, సూపర్‌వైజర్ చారి పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

కురవి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విజయను మరిపెడ ఆత్మ కమిటీ చైర్మన్, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి మంగళవారం కలిసి సన్మానించారు. సీపీఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, తురక రమేష్ పాల్గొన్నారు.

న్యాయ విచారణ చేపట్టాలి

నెల్లికుదురు: పహల్గామ్ హత్యలపై సమగ్ర ఉన్నత స్థాయి దర్యాప్తు చేపట్టి నిందితులను చట్టం ముందుకు తీసుకు రావాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమక్రసీ జిల్లా కార్యదర్శి గౌని అయిలయ్య, ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ధర్నా నిర్వహించారు.

కరపత్రాల ఆవిష్కరణ

నెల్లికుదురు: యాసంగి పంటల ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం చెందడం, నరేంద్ర మోదీ కేంద్రంలో విడుదల చేసిన వ్యవసాయ మార్కెట్ల చట్టసవరణ ముసాయిదాను రైతులు తిర్కరించాలని కోరుతూ మండలంలోని వివిధ గ్రామాలల్లో మంగళవారం అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో సంయుక్త కిసాన్ మోర్చా విడుదల చేసిన కరపత్రాలను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేశవులు, రవిందర్, సైదులు, వీరన్న, యాకయ్య, లక్ష్మి, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

మహబూబాబాద్ రూరల్: మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ జన్మదినోత్సవ వేడుకల సందర్భంగా స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో 500 మంది నిరుపేదలకు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ పాల్గొని పేదలకు అన్నదానం చేశారు.

బాల్య వివాహం.. కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనగపురం గ్రామ శివారు పాత తండాలో బాల్యవివాహం జరిపిన ఘటనపై కేసు నమోదు చేశామని రూరల్ ఎస్సై వి.దీపిక మంగళవారం రాత్రి తెలిపారు. ఈనెల 19వ తేదీ సోమవారం పాతతండాలో ఓ వివాహం జరగగా ఫిర్యాదు వచ్చిన నేపథ్యంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు అక్కడికి వెళ్లి విచారణ చేసి బాల్య వివాహంగా గుర్తించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్ వైజర్ మంచాల భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలిక తల్లిదండ్రులు, పెళ్లి కుమారుడు, తల్లిదండ్రులపై కేసు నమోదు చేశామన్నారు. బాలికను చైల్డ్‌లైన్ అధికారులకు అప్పగించారు.

పోక్సో కేసు నమోదు

దోర్నకల్: మండలంలోని ఓ గ్రామంలో బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన యువకుడు తేజావత్ ప్రవీణ్‌పై బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు డోర్నకల్ సీఐ బి.రాజేష్ మంగళవారం తెలిపారు.

రైతు సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో

కేసముద్రం: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో గొడిశాల వెంకన్న, నీరుటి జలేందర్, శేఖర్, వెంకన్న పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కేసముద్రం: అసంఘటిత రంగ కార్మికుల, హమాలీ, రవాణ, గిగ్ తదితర కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ వివేక్‌కు, ఏఐసీటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల వీరేష్, జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న, బొల్లోజు రామ్మోహనాచారి, పుల్లయ్య, ఈసు, వీరన్న పాల్గొన్నారు.

సాగు ఖర్చులను తగ్గించుకోవాలి

కేసముద్రం: ప్రతీ రైతు తక్కువ యూరియా వాడి సాగు ఖర్చులను తగ్గించుకోవాలని ఏడీఏ అజ్మీరా శ్రీనివాసరావు, కేవీకే మల్యాల ప్రోగ్రాం కోఆర్డినేటర్ మాలతి సూచించారు. మంగళవారం మండలంలోని కల్వల గ్రామంలోని రైతువేదికలో సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే మల్యాల శాస్త్రవేత్తలు రాంబాబు, క్రాంతికుమార్, ఏఓ వెంకన్న పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

కేసముద్రం: ఆయిల్‌పామ్ పంట సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని ఫీల్డ్ ఆఫీసర్ పునీత్ అన్నారు. మంగళవారం ఇనుగుర్తి మండలంలోని కోమటిపల్లి గ్రామంలో రావుల మల్లేశం అనే రైతు సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటను ఆయన పరిశీలించి అవగాహన కల్పించారు.

ఎస్సైపై చర్య తీసుకోవాలి

నెహ్రూసెంటర్: బెల్లం తరలిస్తూ పట్టుబడిన వ్యక్తిని విచక్షణ రహితంగా కొట్టిన ఎస్సైపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ భీమానాయక్ డిమాండ్ చేశాడు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆంగోత్ ప్రశాంత్‌ను మంగళవారం పరామర్శించారు. కార్యక్రమంలో రాందాస్‌నాయక్, శంకర్‌నాయక్, సోనూ, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై విత్తనాలు

గార్ల: ఖరీఫ్‌లో పచ్చిరోట్ట ఎరువు కోసం రాయితీపై విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు తెలిపారు. మంగళవారం వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడారు.

బైండోవర్

దంతాలపల్లి: గుడుంబా కేసులో ఒకసారి బైండోవర్ అయ్యాక మళ్లీ తప్పు పునరావృతం అయితే రూ.లక్ష జరిమానా విధిస్తామని తహసీల్దారు సునీల్‌కుమార్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన బానోత్ శంకర్‌ను గుడుంబా కేసులో అరెస్టు చేసిన తొర్రూరు ఆబ్కారీ శాఖ పోలీసులు మంగళవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

వీరన్న సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే పూజలు

కురవి: మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ పుట్టిన రోజును పురస్కరించుకుని శంకర్‌నాయక్ దంపతులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు అభిమానులు ఆయనను సత్కరించారు.

ముగిసిన సమ్మర్ క్యాంప్

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని కేసముద్రంవిలేజ్ జెడ్పీహైస్కూల్‌లో సమ్మర్ క్యాంప్ మంగళవారం ముగిసింది. కార్యక్రమలో హెచ్‌ఎం వెంకట్రాం నర్సయ్య, పద్మ, నాగమణి, రోజారాణి, సుజాత్, సుధాకర్ పాల్గొన్నారు.

బీఎల్‌ఓలతో తహసీల్దార్ సమావేశం

కురవి: సీరోలు మండలం కాంపల్లి రైతు వేదికలో మంగళవారం బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీరోలు తహసీల్దార్ పున్నంచందర్ పాల్గొని మాట్లాడారు. బీఎల్‌ఓలు సక్రమంగా పనిచేయాలని సూచించారు.